# ఆకృతి

(గిరి కుమార)

**రా**మచంద్రునకు పుట్టకపుట్టక పుట్టిన కొడుకునకిప్పుడు రెండేండ్లింకను దాటలేదు. 'వీడు చాలా తెలివిగలవాడవునని' యా యింట నందరును ననుచుందురు. వాని బుద్ధులన్నియు నట్టివే.

ఒకనాడు పసిపిల్లలందరికీ తలంటిపోయుచున్నారు. రామచంద్రుని మేనల్లుడు చంద్రుడు తన మేనమామ యాయీడు కొడుకుతోడనే వరసలాడు ముచ్చట తీర్చుకొనుచుండును. అతనికి పదునారేండ్లు. అతడును తలంటి పోసికొనుచున్నాడు.

నలుగుపెట్టిన సున్నిపిండి యంతయు పోగుచేసి చంద్రుడు దానికి చేతులు కాళ్లు తల యేర్పరచి బొమ్మవలె చేసి 'అమ్మా! బూచే' అని సత్యాన్ని యేడిపించినాడు. సత్యానికి రెండేండ్లైనప్పటికి భయమన్ననేమో యెఱుగడు. కాని యీ బొమ్మను చూచిన తోడనే జడుసుకుని యేడ్చినాడు.

తన కుమారుడు మంచి ధైర్యశాలియగు ననుకొనెడు వాడు రామచంద్రుడు. ఇది చూచి చంద్రుణ్ణి కోపపడి పసివానికీభయము పోగొట్టవలెనని ఆ బొమ్మ పొడిపొడిగా చేసి బాలునికి చూపినాడు. 'వట్టిదే! ఏమియు లేదురా' యని బాలునిచేత ముట్టుకొనునట్టు చేసినాడు. సత్యం నవ్వినాడు. మరల తండ్రి 'సత్యం' చూచుచుండగా బొమ్మను చేసి ముట్టుకొమ్మనినాడు సత్యం మరల కెవ్వున కేకపెట్టి భయపడినాడు. వాళ్ళ అమ్మ వద్దకు పోయినాడు. వాడు చూచుచుండగా పొడిచేసి మరల భయము తీర్చినాడు తండ్రి, కాని బొమ్మయాకారము చేయుట తోడనే 'సత్యం' తనకది వట్టి పిండియని తెలిసి కూడ భయపడుచున్నాడు.

తుదకు రామచంద్రుడు విఫలప్రయత్నుడై యూరకున్నాడు. 'ఆకృతి'లో నేమున్నది యని రామచంద్రుని ప్రశ్న ?!